ప్రజాశక్తి
మంగళవారం 18 నవంబర్ 2025 5
కర్నూలు

ఉడకని అన్నం.. నీళ్ల చారు..

- మారని సంక్షేమ హాస్టళ్ల తీరు - విద్యార్థులకు తప్పని ఇబ్బందులు - అధికారుల పర్యవేక్షణ కరువు

నీళ్ల చారుతో తినలేక బయటి నుండి తెచ్చుకున్న కూరతో భోజనం చేస్తున్న విద్యార్థి

ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టళ్ల తీరు మారడం లేదు. సమస్యలకు నిలయంగానే ఉన్నాయి. ఎప్పటికప్పుడు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా కృషి చేయాల్సిన అధికారుల జాడ లేకపోవడంతో విద్యార్థులు సమస్యలతో మగ్గిపోతున్నారు. అధికారంలోకి వస్తే సంక్షేమ హాస్టళ్లో విద్యార్థులకు సన్న బియ్యంతో నాణ్యమైన పలు రకాల కూరలతో భోజనం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన పాలకులు సంక్షేమ హాస్టళ్ల బాగోగులనే గాలి వదిలేశారు...

ఎస్సీ నెంబర్ వన్ హాస్టల్ భవనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్‌లో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులను సమస్యలు వేధిస్తున్నాయి. ఆదోని పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ భవనం పోలీస్ కంట్రోల్ రూమ్ వెనకాల ఉంది. అందులో ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ పై చదువులు చదివే వారు సుమారు 150 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు భవనం బాగున్నప్పటికీ తాగునీళ్ల వసతి లేని పరిస్థితి బోరు ఉన్నా ఉప్పునీరు వస్తున్నాయి. ఆ నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లు తాగాలంటే బయట హోటళ్ల నుండి తెచ్చుకుంటున్నామని విద్యార్థులు చెబుతున్నారు. చెంతనే మున్సిపల్ కులాయి ఉన్న నీటి నిలువకు అవకాశము లేని పరిస్థితి ఉన్న సింటెక్స్ ట్యాంకు సరిపోవడం లేదని మరో ట్యాంక్ ఏర్పాటు చేస్తే తాగేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పార్థసారధిని భవనం ప్రారంభంలో విద్యార్థులు కోరిన ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. అధికారులు స్పందించి తాగునీటి నిల్వకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. పట్టణంలో ఎస్సీ బాయ్స్ నెంబర్ వన్ హాస్టల్ భవనం కొత్త బస్టాండ్ రోడ్డు బండిమేట్ ప్రాంతంలో ఉంది.

బాత్‌రూములకు సరిగ్గా లేని తలుపులు

అందులో ఆరు నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు సుమారు 100 మంది వసతి పొందుతున్నారు. భవనంలోనే స్నానపు గదులు మరుగుదొడ్లు ఐదేసి చొప్పున ఉన్నాయి. అవసరాలు తీర్చుకోవాలంటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులు సంఖ్యగా అనుగుణంగా అదనంగా మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. మెనూ ప్రకారం ఆకుకూరలు, పప్పు దినుసులు, గుడ్లు ఇవ్వడంతో పాటు పాలు ఇవ్వాలి. పాలలో నీటి శాతమే ఎక్కువగా ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. నాణ్యమైన భోజనం ఇవ్వాల్సిన వారు నిర్లక్ష్యం చేయడంతో నీళ్ళ చారు ఉడక ఉడకని అన్నముతో అర్ధాకలతో ఉంటున్నామని అంటున్నారు. నెలకొకసారి హెల్త్ ఉద్యోగులు వచ్చి మందులు ఇస్తున్నారని వైద్యులు మాత్రం రావడం లేదని చెబుతున్నారు. జ్వరం వస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో చూపిస్తున్నారని లేదంటే ఊరికి పంపుతున్నారని అంటున్నారు. తరచుగా హాస్టల్లో వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దురుసుగా ప్రవర్తిస్తున్న ఉద్యోగి

ఎస్సీ నెంబర్ వన్ బాయ్స్ హాస్టల్లో విద్యార్థుల పట్ల వంటమనిషి దానప్ప దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. అన్నంలో ఇసుక రేణువులు ఉంటాయని బియ్యము శుభ్రం చేయకుండానే అన్నం వండుతున్నారని చెబుతున్నారు. అన్నం వండే సమయంలో కూడా వ్యక్తిగత శుభ్రం పాటించడం లేదని, ఇదేమని అడిగితే భౌతికంగా దాడి చేయడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ భయాందోళన గురి చేస్తున్నాడని విద్యార్థులు చెబుతున్నారు.

ట్యూషన్ సదుపాయం కరువు

హాస్టల్లో చదివే విద్యార్థులు టెన్త్ లో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు గతంలో ప్రభుత్వం 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ట్యూటర్లతో ట్యూషన్ చెప్పించేది. ప్రస్తుతం ట్యూషన్ సదుపాయం లేకపోవడంతో తరగతుల్లో చదివిన చదువు అర్థం కాక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. స్టడీ అవర్ సమయంలోనైనా తమ సందేహాలను నివృత్తి పరుచుకునేందుకు అవకాశం లేని పరిస్థితి నెలకొంది. వాచ్మెన్ మల్లేష్ పిల్లలతో చదివిస్తూ ఆయనకు తెలిసిన వాటిని నివృత్తి పరుస్తున్నారు. రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

కళాశాల బాయ్స్ హాస్టల్లో మంచినీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఎస్సీ బాయ్స్ హాస్టల్లో వంట మనిషి దానప్ప దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థులు మా దృష్టికి తెచ్చారు. మరోసారి విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించినా అన్నం వండే సమయంలో శుభ్రత పాటించకుండా నిర్లక్ష్యం చేసిన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

- నాగ మద్దయ్య, ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్ వార్డెన్.

సంక్షేమ హాస్టళ్ల పట్ల అధికారులు నిర్లక్ష్యం విడాలి

సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో ఉన్నారు. నెలకు ఒకసారి జిల్లా అధికారులు సంక్షేమ హాస్టల్లో తనిఖీ చేయాలని నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యం చేయడం వల్ల హాస్టల్లో చేరే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. ఇలాగే కొనసాగితే ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలి. లేని ఎడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

- శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇల్లు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్
- 187 టిడ్కో గృహాలు లబ్ధిదారులకు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సొంతింటి కల నెరవేరుస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజీ. భరత్ పేర్కొన్నారు. సోమవారం కర్నూలు నగర శివారులో ఉన్న జగన్నాథగట్టుపై ఎన్‌టిఆర్ కాలనీలో నిర్మాణాలు పూర్తైన టిడ్కో గృహాలను మంత్రి టిజి భరత్ కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్‌లతో కలిసి పంపిణీ చేశారు. ముందుగా నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2,61,040 టిడ్కో గృహాలు ఉండగా 1.40 లక్షల గృహాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇందులో కర్నూలులోనే 10 వేల ఇళ్లు ఉన్నాయని, మిగిలిన వాటి పూర్తి కోసం రూ.18 కోట్లు మంజూరయినట్లు చెప్పారు. 976 ఇళ్లలో తొలుత 187 ఇళ్లను ఇస్తున్నామని, మొత్తం 40 వేల మంది ఇక్కడ నివాసాలు ఏర్పడితే ఈ ప్రాంతం చిన్న పట్టణంలా మారుతుందని తెలిపారు. ఇక్క పోలీస్ ఔట్‌పోస్ట్, యూ-టర్న్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ.. అన్ని వసతులను కల్పించడంతో మార్చి 31లోపు 976 ఇళ్లను అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. టిడ్కోలో అన్ని వసతులతో పేదలకు అనువైన గృహాలు నిర్మాణం జరుగు తున్నాయని చెప్పారు. కుడా చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాకు పరిశ్రమలు భారీగా వస్తుండడంతో యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. లబ్దిదారులు ఇళ్లలో నివసించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్త య్యాయని తెలిపారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ విక్రమ్‌సింగ్, బ్రహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ళ మంజునాథ్, ఏపి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బోయ రామాంజనేయులు, కార్పొరేటర్లు పరమేష్, కైప పద్మలత తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారునికి సమాచారం చేరవేయాలి

- జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బాధితుల నుండి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సిరి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో వచ్చిన సమస్యలపై అర్జీదారునికి నేరుగా వాట్సప్ ద్వారా సమాచారాన్ని చేరవేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుండి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టితో పని చేయాలన్నారు. ప్రతి సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై సమీక్ష చేస్తున్నారన్నారు. పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, అనూరాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇఆర్‌సి భవన్ ఎదుట ధర్నా

- జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పెంచిన విద్యుత్ అదనపు ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దిన్నెదేవరపాడు రోడ్డులోని ఇఆర్‌సి భవన్ ఎదుట మంగళవారం చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు కోరారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం రెండు నగర కమిటీల కార్యదర్శి వర్గ సమావేశాన్ని ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో కూటమి ప్రభుత్వం దొడ్డి దారిన సౌర విద్యుత్ పేరుతో దళితుల ఇళ్లకు, ఉద్యోగుల ఇళ్లకు, షాపులకు బిగించి అదానీకి, శిరిడి సాయి ఎలక్ట్రికల్స్‌కు ఊడిగం చేస్తుందని విమర్శించారు. మరోసారి ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.12,717 కోట్ల భారాన్ని మోపడానికి ఇఆర్‌సి ఉన్నతాధికారులు, ఛైర్మన్ నేడు ప్రజాభిప్రాయ సేకరణ పెడుతున్నారని తెలిపారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.అరుణ, వై.నగేష్, ఎం.విజయ, రామాంజనేయులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయిబాబా, కె.సుధాకరప్ప, ఎస్ఎండి షరీఫ్ పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్
- ఓర్వకల్లు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆటో జాతా ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ పారిశ్రామిక వాడలో నెలకొల్పే పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో జాతాను డి.గౌస్ దేశాయ్ ప్రారంభించారు. అనంతరం మండల నాయకులు ఎస్ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ఆయన మాట్లాడారు. పారిశ్రామిక వాడ పేరుతో దాదాపుగా 30 వేల ఎకరాల భూమిని రైతుల నుండి సేకరించారన్నారు. రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదన్నారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, మండల నాయకులు టి మల్లేష్, స్థానికులు బుజ్జన్న, హరి, రవి, రవీంద్ర, అశోక్, జగన్నాథం, రామాంజనేయులు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో జాతాను ప్రారంభిస్తున్న డి.గౌస్ దేశాయ్

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సిరి

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో శ్రీచక్ర హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ప్రారంభించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్ మాట్లాడుతూ... మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, దీనికి సహకరించిన శ్రీచక్ర హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. యజేశారు. శ్రీచక్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అడగగానే తమ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిందని తెలిపారు. టూడి ఎకో, ఈసీజీ, ఆర్‌బిఎస్, బిపి, కంటి సంబంధిత పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. చికిత్స కంటే నివారణే మంచిదని, ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. శ్రీచక్ర హాస్పిటల్‌లో అన్ని ప్రయివేట్ ఇన్స్యూరెన్స్ హెల్త్ స్కీమ్స్, ఎన్‌టిఆర్ ఉచిత వైద్య సేవ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రముఖ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ ఎం.మహ్మద్ అలీ, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రదీప్ కుమార్, ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ కె.హరీష్ కుమార్, వైద్యులు డాక్టర్ సాధిక్, డాక్టర్ కిశోర్, డాక్టర్ షాఫీ, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నదీమ్, మేనేజర్ కె.సురేంద్ర, ఎం.కిరణ్ కుమార్, ఎం.కల్యాణ్, కె.రామాంజనేయులు, షేక్ ఫైజుల్ రహెమాన్, బి.రాజేష్ బాబు, షేక్ అమీర్ బాషా, ఆర్.పవన్, సయ్యద్ జిలాన్ పాల్గొన్నారు.

'రైతు బాలరాజు కుటుంబాన్ని ఆదుకోవాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పంటల సాగు కోసం చేసుకున్న అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న రైతు బాలరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నన్నూరు గ్రామంలో మృతుడు బాలరాజు కుటుంబాన్ని రైతుసంఘం ప్రతినిధి బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన బాలరాజు మూడెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అదనంగా భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశారని తెలిపారు. పంటల దిగుబడి తగ్గడంతో అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యల నివారణ కు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని తెలిపారు. రైతుసంఘం నాయకులు బషీర్, దస్తగిరి, సిఐటియు నాయకులు షాజహాన్, పుల్లయ్య, ఎన్.స్వాములు, సంజీవ కుమార్, రామచంద్రుడు పాల్గొన్నారు.

విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

- రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్
- కలెక్టరేట్ ఎదుట విఆర్ఎల సంఘం ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. విఆర్ఎల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు విఆర్ఎలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు, విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడారు. విఆర్ఎలకు అక్రమ డ్యూటీలు రద్దు చేయాలన్నారు. అక్రమ నైట్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు తొలగించాలని, రీసర్వే పేరుతో ఇతర గ్రామాల్లో విఆర్ఎలను ఉపయోగించరాదన్నారు. డ్యూటీలు చేయడానికి నెలకు రూ.5 వేలు ఖర్చు అవుతుందన్నారు. రూ.6 వేల వేతనంతో ఎలా బతకాలని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మేన్, రికార్డ్ అసిస్టెంట్, విఆర్ఒ ప్రమోషన్లను వన్ టైం సెటిల్‌మెంట్ కింద భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ఉపాధ్యక్షులు మల్లయ్య, హనుమంతు, సహాయ కార్యదర్శులు భీమలింగ, రంగయ్య, రామాంజనేయులు, మహేష్, భీమ లింగ, నాగరాజు, చంద్రయ్య, వీరేష్, వెంకటరాయుడు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'చిప్పరౌస్ గుడిసెలకు పట్టాలివ్వాలి'

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

గొందిపర్ల చిప్పరౌస్ గుడిసెలకు పట్టాలు, ఈ.తాండ్రపాడులో ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ కోరారు. ఆందోళన చేసిన సందర్భంగా రెవెన్యూ అధికారులు ఇచ్చిన మాటను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర, శ్రీరాములు, బాలపీరా, సీనియర్ నాయకులు ఆంజనేయులు తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణ, హుస్సేనయ్య మాట్లాడారు. గొందిపర్ల చిప్పరౌస్ ప్రభుత్వ స్థలంలో గత 40 ఏళ్ల నుంచి పేదలు కొట్టాలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం రేషన్, ఆధార్ కార్డులు, విద్యుత్ మీటర్లు మంజూరు చేసిందని తెలిపారు. వారికి పట్టాలు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. అలాగే 2009 వరదల సందర్భంగా ఈ.తాండ్రపాడు గ్రామంలో ఇల్లు కట్టుకోవడానికి పట్టాలిచ్చి నేటికీ స్థలం చూపించలేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని అక్టోబర్ 27న ఆర్‌డిఒ కార్యాలయం ముందు బాధితులు ఆందోళన చేస్తే అధికారులు వారంలోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నెల కావస్తున్నా నేటికీ పరిష్కరించలేదని చెప్పారు. నిర్లక్ష్యం వీడి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాలను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

ప్రజలకు సేవలందించడమే ధ్యేయం

- ఎస్ఐ వేణుగోపాల్ రాజు

ప్రజాశక్తి - సిబెళగల్

ప్రజలకు సులువైన మార్గంలో సేవలు అందించడమే పోలీసుల ధ్యేయమని ఎస్ఐ వేణుగోపాల్ రాజు పేర్కొన్నారు. సోమవారం బెళగల్‌లోని పాత బస్టాండ్ దగ్గర పోలీసు సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజలకు సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు, సమాజానికి నష్టం, కష్టం కలిగించే సంఘటనలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో చిన్నపాటి గొడవలు, మనస్పర్థలు పెద్దగా చేసుకొని కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారని, ప్రశాంత జీవనం గడిపేందుకు అలవాటు చేసుకోవాలని కోరారు.

కనీస పెన్షన్ రూ.9 వేలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఇపిఎఫ్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. కర్నూలు అశోక్ నగర్‌లోని పిఎఫ్ ఆఫీస్ దగ్గర ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘం, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుధాకరప్ప అధ్యక్షత వహించారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు జె.దివాకర్, బిఎస్‌ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యాకోబ్, బి. మహేశ్వరరావు, సిఐటియు నాయకులు సిహెచ్ సాయిబాబాలు మాట్లాడారు. ఇపిఎఫ్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలను కోరుతున్నా.. అమలు చేయకపోవడంతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో 30 నుండి 40ఏళ్లపాటు సేవలు చేసి వృద్ధాప్య సమయంలో ప్రశాంత జీవితం గడపడానికి, ఆరోగ్యాలను కాపాడుకోవడానికి, తిండి ఖర్చులకు నెలకు రూ. 12 వేలు అవసరం ఉంటుందని తెలిపారు. సర్వీస్‌లో కొనసాగిన సమయంలో పైసా పైసా కూడపెట్టి ఇపిఎఫ్ పెన్షన్ కోసం జమ చేసి, చివరి జీవిత అంతంలో దాని ప్రయోజనాలు అనుభవించడానికి హక్కు లేకుండా ఈ ప్రభుత్వాలు పెన్షనర్లను మానసిక క్షోభకు గురి చేస్తున్నాయని విమర్శించారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కనీస పెన్షన్ పెంచుతామని వాగ్దానం చేసి 11ఏళ్లు అవుతున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. ఐదు నుండి పదేళ్లు రాజకీయ పదవులు అనుభవించిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ జీతాలు పెంచుకుంటూ పదవి అనంతరం వేల రూపాయల పెన్షన్లు తీసుకుంటూ తమ అవసరాలు తీర్చుకుంటున్నారని అన్నారు. కష్టపడి చెమటోడ్చి ప్రభుత్వాలకు ఆదాయాన్ని తెచ్చి సామాజిక ఉత్పత్తిలో భాగం పంచుకున్న కార్మికులను విస్మరించడం అన్యాయమన్నారు. ఇది ప్రభుత్వాలకు ఏమాత్రం తగదని హితవు పలికారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇచ్చేలా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్ 95 పెన్షనర్లకు ఇఎస్ఐ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, రైల్వేలలో గతంలో ఉన్న రాయితీలను తిరిగి పునరుద్ధరించాలని, ఆరోగ్యశ్రీ కార్డులివ్వాలని, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బిఎస్ఎన్ఎల్, పేపర్ మిల్, గ్లాస్ ఫ్యాక్టరీ, పాల డెయిరీ, ఆర్టీసీ పెన్షనర్ నాయకులు మద్దిలేటి, బసయ్య, యాగంటయ్యా, మోహన్, సూర్యనారాయణ, గోపాలరావు, రామనాగిరెడ్డి, నరసింహులు, చెన్నకేశవులు, సోమేశ్వర రావు, లక్ష్మన్న, వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

- ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కెఇ.శామ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఆంధ్రప్రదేశ్ సగర/ఉప్పర వెల్ఫేర్, డెవలప్ మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్‌వి.ప్రసాద్, పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఆలంకొండ నబి సాహెబ్, టిడిపి మండల సీనియర్ నాయకులు కటారుకొండ మర్రి శ్రీరాములు, టిడిపి మండల అధ్యక్షులు పెనుకులపాటి దామోదర్ నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు బొంతిరాళ్ల రఫీ, యు.గురుస్వామి, వై.శివ రాముడు, బి.రామాంజనేయులు హాజరయ్యారు. ఎంపిడిఒ మోహన్ కుమార్, పంచాయతీరాజ్ ఎఇ జాకీర్ హుస్సేన్, ఆర్‌డబ్ల్యుసిఐఇ హరి, పందిర్లపల్లె మోహన్, టిడిపి మండల ఉపాధ్యక్షులు శ్రీధర్ గౌడ్, పోతుగల్లు సోమలింగన్న గౌడ్, షేక్ సజ్జాద్, పెనుకులపాటి చక్రపాణి, అడివయ్య, జ్యోతి గౌడ్, సద్దల రమేష్, క్రిష్ణగిరి సహకార సొసైటీ డైరెక్టర్ రామాంజనేయులు, బంకు బాలు, విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ మధు, సర్పంచి రామాంజనేయులు, బి.భాస్కర్, బి.తిరుపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ హరికృష్ణ, గుండ్ల మల్లాపురం బ్రహ్మయ్య, మల్లేష్, సుధాకర్, జయన్న, ఆగవేలి వెంకటేష్ పాల్గొన్నారు.

సాగు, తాగునీటి కోసం..

జీపుజాతాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - మద్దికెర

సాగు, తాగునీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో జరిగే జీపుజాతాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలో మద్దికెర, బురుజుల, పెరవలి, అగ్రహారం గ్రామాల్లో రైతులకు కరపత్రాలు పంచుతూ జీపుజాతా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో వెనుకబడిన మద్దికెర మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలో హంద్రీనీవా కాలువ అందుబాటులో ఉన్నప్పటికీ సాగు, తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. హంద్రీనీవా ద్వారా పిల్లకాలువలు ఏర్పాటు చేసి గ్రామాలకు సాగునీరందిస్తే వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. బురుజుల గ్రామం దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేస్తే 10 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని, వలసలు నివారించవచ్చని చెప్పారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20న ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, పత్తికొండ మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర, మండల అధ్యక్షులు గోపాల్, పెరవల్లి గ్రామం హమాలీలు రాము, శివ, పరమేష్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు, సొసైటీ సిబ్బంది

సొసైటీలో అందుబాటులో యూరియా

- 9 ఏళ్ల తర్వాత ప్రారంభమైన ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని నాయకులు తెలిపారు. సోమవారం సొసైటీ అధ్యక్షులు ఎన్‌వి.రామాంజినేయులు, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, బేతాళ బడేసాబ్, టిడిపి పట్టణ అధ్యక్షులు మహేళ రహమతుల్లా, పూజారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. రామాంజినేయులు మాట్లాడుతూ.. యూరియా అవసరం ఉన్న రైతులు పొలం పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు తీసుకొచ్చి యూరియాను తీసుకెళ్లాలని తెలిపారు. గతంలో గోనెగండ్ల సొసైటీలో యూరియాతో పాటు రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేసేవారు. సుమారు 9 ఏళ్లుగా పంపిణీ ఆగిపోయింది. తిరిగి ఇప్పుడు యూరియా పంపిణీతో ఎరువుల పంపిణీ ప్రారంభం కావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. పిఎసిఎస్ సిఇఒ చంద్ర శేఖర్, టిడిపి నాయకులు డీలర్ ఫక్రుద్దీన్, టమోటా హుసేన్, బాబు నాయుడు, గాజులదిన్నె చంద్ర, సందీప్ నాయుడు, లక్ష్మి నారాయణ, సొసైటీ సిబ్బంది మునిస్వామి, జయచంద్ర, లక్ష్మన్న పాల్గొన్నారు.

అంచెలంచెలుగా ఎదగాలి

- టిడిపి నాయకులు చంద్రశేఖర్ - బెల్లం టీ స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

బెల్లం టీతో ప్రజల మన్ననలు పొంది వ్యాపారం లాభసాటిగా సాగి అంచెలంచెలుగా ఎదగాలని టిడిపి నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంక్ మెయిన్ బ్రాంచి ఎదురుగా దస్తగిరి సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన బెల్లం టీ స్టాల్‌ను చంద్రశేఖర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... అనవసరంగా ఎక్కడెక్కడో తిరిగి సమయాన్ని వృథా చేయకుండా ఏదో వ్యాపారం చేస్తూ.. ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. రుచికరమైన మంచి టీతో ప్రజలను అలరించాలన్నారు. నాగేష్, టిడిపి నాయకులు శంకర్ గౌడ్, బందేనవాజ్, కలీముల్లా పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

- ఎస్ఐ సతీష్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ సతీష్ కుమార్ సూచించారు. సోమవారం చిప్పగిరి నుంచి గుంతకల్లు వెళ్లే రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. ఓవర్ లోడు, ఓవర్ స్పీడు, ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా బైకులు నడపడం, ఇతర వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. పోలీసులు షబ్బీర్, మురళీ కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై తల్లిదండ్రుల నుంచి తప్పించుకుని మంత్రాలయం వచ్చిన బాలికను సిఐ రామాంజులు అప్పగించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాలిక భూమిక తల్లిదండ్రులు ఆశ, రాజేష్‌కు అప్పగించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన భూమిక పదో తరగతి చదువుతున్నారని, తండ్రి తిట్టాడని తల్లిదండ్రులకు చెప్పకుండా మంత్రాలయం వచ్చిన భూమిక స్వామి వారి దర్శన అనంతరం తల్లిదండ్రులు గుర్తుకు రావడంతో పక్కన ఉన్న వారితో తల్లిదండ్రులకు ఫోన్ చేయించారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పోలీసులు మహిళా పోలీసు రత్నమ్మ వద్ద భద్రత కల్పించి భూమికను తల్లిదండ్రులకు అప్పగించారు. హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మినారాయణ, ఎంవి.రమణ పాల్గొన్నారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సిఐ

అదనపు గదులు పూర్తి చేయాలి

- సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

ప్రజాశక్తి - ఆదోని

నాడు-నేడు కింద అసంపూర్తిగా మిగిలిన భవనాలను పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని పర్యటనకు వచ్చిన విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేవని తెలిపారు. నిర్మిస్తున్న అదనపు గదులు అసంపూర్తిగా, మొండిగోడలుగా ఉన్నాయని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. విద్యార్థులకు అనుగుణంగా మరో రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నిర్మాణం చేపట్టాలన్నారు. సిపిఎం పట్టణ నాయకులు అజీమ్ ఖాన్, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, యుటిఎఫ్ పట్టణ నాయకులు సునీల్ రాజ్ కుమార్, మల్లికార్జున, జగన్ ఉన్నారు.

విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిప్పగిరిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యాధికారులు

గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలి

- ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

దేవనకొండలో

గ్రంథాలయాలకు వెళ్లడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని, గ్రంథాలయానికి ఒక గంట సమయం కేటాయిస్తే కొత్త కొత్త సమాచారం తెలుసుకోవచ్చని ఎంఇఒలు సావిత్రమ్మ, ఫరూక్, చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీఫ్ తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిప్పగిరి గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు 'గ్రంథాలయాల వల్ల కలిగే ఉపయోగం'పై వివరించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రంగనాయకులు, గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, జ్ఞాన సుధా పాఠశాల విద్యార్థులకు ఝాన్సీ లక్ష్మీబాయి గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసులు గ్రంథాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమాజాన్ని మేల్కొలిపే వారే జర్నలిస్టులు

- ఆవోపా, వామ్ అధ్యక్షులు శ్రీనాథ్ గుప్త

ప్రజాశక్తి - ఆదోని

సమాజం మేలుకొలుపులో జర్నలిస్టుల పాత్ర కీలకమని వక్తలు కొనియాడారు. సోమవారం జర్నలిస్ట్ డే సందర్భంగా ఆదోని ఆవోపా, వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్త సౌజన్యంతో జర్నలిస్టులను శాలువాతో సన్మానించారు. ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్), లయన్స్ క్లబ్, ఐఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మానం కార్యక్రమానికి ప్రముఖులు హాజరయ్యారు. సమాజ సేవకుడు కాకుబాల్ నాగేష్, ఆవోపా, వామ్ కార్యదర్శి రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు రత్నయ్య, రఘు, వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్షులు వంకదారు మమతశ్రీ ఉన్నారు.

జర్నలిస్టులను సన్మానిస్తున్న నాయకులు

చెత్తాచెదారం తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన
- అంగన్వాడీ కేంద్రం చుట్టూ శుభ్రం చేయించిన అధికారులు

ప్రజాశక్తి - ఆస్పరి

చెత్త, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న అధికారులు

అంగన్వాడీ కేంద్రం చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను పంచాయతీ కార్యదర్శి విజయరాజు సోమవారం జెసిబితో శుభ్రం చేయించారు. 'అంగన్వాడీ చుట్టూ చెత్తాచెదారం' అన్న శీర్షికన ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం ఆస్పరిలోని అంగన్వాడీ-4 కేంద్రం పరిసరాల చుట్టూ చెత్త, మొక్కలను తొలగించారు. కేంద్రం సమీపంలోని కాలనీ వాసులు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని, బహిర్భూమికి వెళ్లరాదని అధికారులు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత, గ్రామ పెద్ద రాఘవేంద్ర, వార్డు మెంబర్ మహేష్ ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో మలవిసర్జన చేస్తే జరిమానా

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం సమీపంలో ఎవరైనా మలవిసర్జన చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని పంచాయతీ కార్యదర్శి విజయరాజు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగుదొడ్ల నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తున్నాయని, ప్రతిఒక్కరూ ఇంటి దగ్గర మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో బహిర్భూమికి వెళ్లడం వల్ల అనేక జబ్బులు వస్తాయని తెలిపారు.

మండలం కోసం రెండో రోజూ దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాలని, పెద్దహరివాణం గ్రామాన్ని మండలం చేయాలని స్థానికులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం రెండో రోజుకు చేరాయి. సోమవారం పట్టణంలోని భీమాస్ కూడలిలో పెద్దహరివాణం గ్రామస్తులు చేపట్టిన దీక్ష శిబిరానికి పలువురు మద్దతు తెలిపారు. పెద్దహరివాణం గ్రామ, మండల సాధన కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం దీక్ష ప్రారంభమైంది. ఆదోని జిల్లా సాధన కమిటీ నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కన్వీనర్ కోదండ, కోకన్వీనర్ దస్తగిరి నాయుడు మాట్లాడుతూ... ఆదోని జిల్లా కోసం గతం నుంచి ఆందోళన జరుగుతూనే ఉందన్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్ వెనుకబడిన ప్రాంతమని, ఆదోనిని జిల్లాగా, పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించే వరకు దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీసీ సంఘం నాయకులు దేవిశెట్టి ప్రకాష్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కత్తి హనుమంతరావు, బెస్త ప్రకాష్, బెస్త దీపక్ కుమార్, బోయ చిన్న ఈరప్ప, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు సోమశేఖర్, పట్టణ నాయకులు రియాజ్, మాల మహాసభ నాయకులు శ్రీనివాసులు మద్దతు తెలిపారు.


దీక్ష శిబిరానికి సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నేడు ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో 'ప్రజా దర్బార్'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మండల ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి మంగళవారం ప్రజా దర్బార్ చేపట్టనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కుర్ని కల్యాణ మండపంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు గ్రామంలో పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఉదయం నుంచి ముగ్గురు వ్యక్తులు, ఒక పొట్టేలుపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పిచ్చి కుక్క దాడిలో నాలుగేళ్ల చిన్నారి ఆకాష్ గాయపడ్డాడు. సోమవారం చిన్నారి తండ్రి నాగరాజు మాట్లాడారు. తన కుమారుడు ఆకాష్‌ను తన అత్త దగ్గర వదిలి పొలం పనులకు వెళ్లామని, పిల్లాడు అంగడి దగ్గరికి వెళ్లిన సమయంలో కుక్క దాడి చేసిందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆకాష్‌ను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లామని, వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి అంబులెన్స్ సహాయంతో తీసుకెళ్లామని చెప్పారు. కొన్ని నెలల క్రితం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆకాష్‌ను పాఠశాల మానిపించి ఇంటి దగ్గరే ఉంచామని, ఆరోగ్యం కుదుటపడే సమయానికి కుక్క దాడి చేయడం దురదృష్టకరమని ఆయన కన్నీరు పెట్టుకున్నారు.

గాయపడిన చిన్నారి

అధికారుల మాటలు సమావేశాలకే పరిమితం

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని పశు వైద్యాధికారులు సర్వసభ్య సమావేశంలో అనేకసార్లు చెప్పారు. వారి మాటలు సమావేశాలకు పరిమితం అవుతున్నాయి. కుక్కలను నియంత్రించడానికి ప్రయత్నించిన దాఖలాలు ఒక్కటి కూడా కనిపించడం లేదు. మండలంలో కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనదారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. నందవరం గ్రామంలో వందల మంది కుక్కకాటుకు బలైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ రాజేశ్వరి

పౌష్టికాహారం అందించాలి

- సిడిపిఒ రాజేశ్వరి

ప్రజాశక్తి - కోసిగి

అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సిడిపిఒ రాజేశ్వరి, సూపర్‌వైజర్లు కాత్యాయిని, భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం గ్రామంలోని 13వ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేయాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. పోషణ ట్రాకర్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలన్నారు. బరువులు, ఎత్తులు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. బాలింతలకు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ అందించాలన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆదోని

మాధవస్వామి (ఫైల్)

ఆదోని శివారులోని ఆస్పరి రోడ్డులో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందారు. సోమవారం ఆదోనిలోని ఆస్పరి బైపాస్ రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో ఎమ్మిగనూరు నుంచి ఆదోనిలోకి పత్తి గింజల లోడుతో వస్తున్న ఎపి 04 1430 నెంబర్ గల లారీ నడుచుకుంటూ వస్తున్న ఆదోనికి ఎమ్ఐజి కాలనీకి చెందిన మాధవస్వామిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కోలుకోలేక విద్యార్థి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

శరణ (ఫైల్)

కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శరణ (15) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. సోమవారం సిఐ అశోక్ కుమార్ మాట్లాడారు. కౌతాళం గ్రామానికి చెందిన వీరేష్, గౌరమ్మ దంపతుల కుమారుడు శరణ శుక్రవారం తన స్నేహితునితో కలిసి ఆదోనికి వెళ్లారని, తిరిగి వస్తుండగా తుంగభద్ర దిగువ కాలువ వద్ద గడ్డితో వస్తున్న ట్రాక్టర్‌ను గమనించకపోవడంతో అదుపు తప్పి కాలువ దిమ్మెకు ఢీకొన్నారని తెలిపారు. శరణ తలకు గాయాలు కావడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారని, చికిత్స పొందుతూ కోలుకోలే సోమవారం మృతి చెందారని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అదుపు తప్పిన లారీ

- పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ
- విద్యుదాఘాతంతో లారీ ముందు భాగం దగ్ధం
- ప్రాణాలతో బయటపడిన డ్రైవర్

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిన్నహోతూరు గ్రామ సమీపంలో లారీ అదుపుతప్పి పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. మంటలు చెలరేగి ముందు భాగం పూర్తిగా దగ్ధమైందని సిఐ గంగాధర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... ఆర్‌జె 51 జెబి 6077 నెంబర్ గల 22 చక్రాల లారీ సోమవారం బళ్లారి నుంచి నంద్యాలకు క్లింకర్ లోడ్‌తో బయల్దేరింది. చిన్నహోతూరులోని స్పీడ్ బ్రేకర్ దగ్గర తన ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి కుడివైపు ఉన్న పొలంలోకి వెళ్లింది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పోల్‌ను ఢీకొట్టడంతో విద్యుదాఘాతానికి గురయి లారీ ముందు ఇంజిన్ భాగం దగ్ధమైంది. ముందు, మధ్య భాగంలో ఉన్న 10 టైర్లు పూర్తిగా కాలి పోయాయి. ఆలూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లారీ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదంలో బోయ రంగన్నకు చెందిన వరి గడ్డి వాము కాలిపోయింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గంగాధర్ తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ గంగాధర్

రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం..!

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో నిర్మాణం చేపడుతున్న రోడ్డులో మధ్యలో విద్యుత్ స్తంభం అలాగే ఉంది. చెరువు కట్ట వైపు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం సిసి రోడ్డు వేసేందుకు, ప్రజలకు ఇబ్బందిగా ఉందని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించారు. విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరినా తొలగించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రధాన దారిలో విద్యుత్ స్తంభం తొలగించకుండానే సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందుకు ఎవరి నిర్లక్ష్యమో... ఎవరు బాధ్యులని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా తిమ్మారెడ్డి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఇంగలదహాల్ గ్రామంలో కీర్తిశేషులు కెసి.తిమ్మారెడ్డి జయంతి వేడుకలను సోమవారం యూత్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపిటిసి మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. తిమ్మారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిమ్మారెడ్డి చేసిన అభివృద్ధి, గ్రామానికి విద్యాసంస్థలు, పాఠశాలలు, వసతి గృహం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పోస్టాఫీస్ వంటి కార్యక్రమాలను వివరించారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ... తిమ్మారెడ్డి ఆశయ సాధనకు ముందుండి గ్రామ సమస్యలపై పోరాడతామని తెలిపారు. గ్రామ పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాండు, బోడి, రాజు, రఫీ, మూకన్న, మల్లికార్జున, కార్తీక్, కుమార్, వినోద్ పాల్గొన్నారు.

మహిళకు ప్రదీప్ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆస్పత్రిలో ఉన్న ప్రదీప్ రెడ్డి

కర్ణాటక రాష్ట్రం గుంజెహల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసిపి మహిళా నాయకులు రంగమ్మను వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి పరామర్శించారు. సోమవారం కర్ణాటక రాష్ట్రం రాయచూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. వైసిపి నాయకులు బాబురెడ్డి, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు దశరథరెడ్డి ఉన్నారు.

రాఘవేంద్రరెడ్డితో ఉన్న డైరెక్టర్లు

రాఘవేంద్ర రెడ్డిని కలిసిన బోర్డు డైరెక్టర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డిని బోర్డు డైరెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎపి హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, ఎపి బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజనేయులు సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఇన్‌ఛార్జీ స్వగృహంలో ఆయనను కలిసి శాలువా వేసి సన్మానించారు. ఆయన కూడా వారిని శాలువాలతో సన్మానించి, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు రఘు, నాగన్న, భీమా, రఘు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సిల్వర్ జూబ్లీ కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం పుస్తక ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను క్లస్టర్ వర్సిటీ ఇన్‌ఛార్జీ రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు. కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ నాయకంటి మద్దయ్య మాదిగ ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది.

చదువుతోనే సహాయగుణం : ఎంఇఒ

- మెయిన్ స్కూల్‌కు ప్లేట్లు పంపిణీ చేసిన పూర్వ విద్యార్థి

ప్రజాశక్తి- గోనెగండ్ల

చదువుకుంటేనే ఏదైనా సాధించగలమని, ఇంకొకరికి సహాయం చేయగలమని ఎంఇఒలు రామాంజినేయులు, నీలకంఠ తెలిపారు. సోమవారం గోనెగండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)కు పాఠశాల పూర్వ విద్యార్థి పి.ఫారుక్ భోజనం ప్లేట్లను అందజేశారు. ఎంఇఒలు ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని తెలిపారు. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదలతో బాగా చదవాలని సూచించారు. గోనెగండ్ల మెయిన్ స్కూల్‌లో 1995-99లో (1 నుంచి 5 వరకు) చదివిన పి.ఫారుక్ బాషా బాగా చదువుకొని నేడు విదేశాల్లో స్థిరపడి తాను చదువుకున్న పాఠశాలకు దాదాపు రూ.10వేలతో 140 భోజనం ప్లేట్లు అందజేశారని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థి తండ్రి నూర్ అహ్మద్ ఎంఇఒల చేతుల మీదుగా ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బతకన్న ఆధ్వర్యంలో ఎంఇఒలు నూర్ అహ్మద్ తదితరులను శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఊట్ల రంగన్న, పూర్వ విద్యార్థులు రంగస్వామి నాయుడు, కిరణ్ కుమార్, మునిస్వామి, కౌలుట్లయ్య, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఎంఇఒ

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రోడ్డు బాగు చేయాలని నిరసన

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు బాగు చేయాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని మండలంలోని నాగనాథనహళ్లి గ్రామస్తులు, ఆటో డ్రైవర్లు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ధనాపురం నుంచి హోళగుంద రోడ్డు గుంతలుమయంగా మారి అధ్వానం ఉందని, ఈ రోడ్డులో ప్రయాణం చేయడం వల్ల ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు. అందులో కూర్చున్న వారు నడుము నొప్పితో బాధ పడుతున్నారన్నారు. అనంతరం డిఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ధనాపురం ఉదయ్, రాష్ట్ర కార్యదర్శి బాలు, నాయకులు వీరేష్, రవి, మహానంది సంఘీభావం తెలిపి మాట్లాడారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ రాకపోకలు కొనసాగించడానికి ఆలస్యమవుతోందని, పట్టించుకునే వారే లేరని తెలిపారు. ఈ రోడ్డు గుండా ప్రజలు ఎక్కువగా తిరుగుతుంటారని, ఉపాధి పనుల కోసం కూలీలు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని గతంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా వచ్చే నెలలో పనులు మొదలు పెట్టి జనవరిలోపు ధనాపురం నుంచి హోళగుంద వరకు రోడ్డు వేయిస్తామని హామీఇచ్చారని, కార్యరూపం దాల్చలేదని తెలిపారు. రవి, వీరేష్, కిరణ్, నవీన్, నిఖిల్ పాల్గొన్నారు.

పైపు లీకుతో రోడ్డు దుర్భరం

- శ్మశానానికి, ఈద్గాకు వెళ్లేందుకు ముస్లిం, మైనార్టీల ఇబ్బందులు

ప్రజాశక్తి - నందవరం

పైపు లీకేజీతో దుర్భరంగా తయారయిన రహదారి

మండలంలోని నాగులదిన్నె గ్రామంలో తాగునీటి పైపు లీకేజీతో రోడ్డు దుర్భరంగా తయారయింది. గత కొన్ని రోజులుగా లీకయిన నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో గ్రామస్తులు బురదలో నడవ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామానికి కలుషిత నీరు సరఫరా అవుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, పాలకులకు తెలిపినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

శ్మశానానికి, ఈద్గాకు వెళ్లేందుకు ముస్లిం, మైనార్టీల ఇబ్బందులు

గ్రామంలో ముస్లిం, మైనార్టీలు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు, ఈద్గాకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. మృతదేహాన్ని తీసుకెళ్లే సమయంలో ఆ ప్రదేశంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. ఈద్గాకు వెళ్లి రావాలంటే ముళ్లపొదల్లో వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం
- పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నౌసన్న

ఆ ప్రదేశాన్ని పరిశీలించాం. పైపు లీక్ కావడంతో పరిస్థితి ఇబ్బందిగా మారింది. సమస్యను త్వరలో పరిష్కరిస్తాం.

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE COURT ::KURNOOL
E.P.No.26/2025 IN DISPUTE NO.03/2023
M/s Dhanalakshmi Sirnivasan Chit Funds (A) Pvt. Ltd. reptd by its Foreman, M.Raghavendra ...DHR.
-Vs-
Bokuri Prasad and 5 others. ...JDRS 1 TO5
NOTCE TO JDR NO.1
Bokuri Prasad S/o B.Ranganna, Govt Teacher, H.NO.BASIC NO.15, Kadambari Town Ship, B.Tandrapadu (vi) Kurnool,

పై నెంబర్ E.P CASE లో వారు వారికి రావలసిన బాకీ మొత్తము, రూ,,21,47,237/-,అసలు ఖర్చులు ముందు వడ్డీ రాబట్టుటకు గాను మీ పైన దాఖలు చేసిన వరకు JDR NO.1 అయిన నీకు యేమైనా ఆక్షేపణ వున్న 26/11/2025 వ తేదీన పగలు గంటలకు 10.30 నిమిషములకు పై కోర్ట్ లో హాజరై తెలుపు కొనవలేయును,లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించ బడును.

B.Sreenivasulu,
Advocate for DHR Kurnool.
Cell no.9652155539
(కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది : 26/11/2025
BY ORDER OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE COURT :: KURNOOL

IN THE COURT OF THE HON'BLE II ADDL.DISTRICT JUDGE, KURNOOL, AT ADONI
I.A.No: 351/25 IN O.S.No.20/2011
Shanthalakshmamma Died by L. Rs. …Plaintiffs
Vs.
Bheema Reddy & others. …Defendants
NOTICE TO THE DEFENDANTS NO.3, 26, 28 to 30
To
Respondent No. 3
Smt.Kaveramma W/o B. Krishnamurthy, Hindu, Aged about 58 years, House wife, H.No.6/260, Car Street, Yemmiganur Town, Kurnool Dist.
Respondent No.26
Saraswathi alias Narasamma W/o M. Sreenivasulu, Hindu, Aged about 38 years, H. No1/2204, Weavers colony, Yemmiganur town Kurnool Dist.
Respondent No.28 to 30
28. Meghanath S/o not known Hindu, aged about 42 years, Near Vinayaka Kalyana Mantapam, Kodumur village & Mandal, Kurnool Dist.
29. Sreenivasulu S/o Meghanath, Hindu, aged about 15 years, Minor,
30. Sashikumar S/o Meghanath, Hindu, aged about 12 years, Minor,
Defendant No.29 & 30 are minors
R/by Defendant No.28 father as natural guardian
Whereas the above named petitioner filed partition suit against the Respondents. Hence you are hereby required to appear before this court on 19.11.2025 at 10.30 AM in person or through an advocate and answer the said suit, otherwise the matter will be decided exparty.
(By Court Order)
M.K. GURURAJA RAO
Advocate, Adoni.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజల సౌకర్యార్థం రోడ్డు ఏర్పాటు చేయాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగర శివారులోని నంద్యాల రోడ్డు సమీపంలో ఉన్న కాలనీలకు వెళ్లేందుకు ప్రజల సౌకర్యార్థం రోడ్డు ఏర్పాటు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు సమీపంలో నంద్యాల రోడ్డు నుంచి శ్రీనిలయం కాలనీ, అనాథ పిల్లల, వికలాంగుల ఆశ్రమం మీదుగా టిజి.నగర్, ఆర్‌టిఒ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రోడ్డు శిథిలమై వర్షాకాలం బురదమయంగా మారిందన్నారు. వేసవిలో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారని, ప్రజల సౌకర్యార్థం రోడ్డు నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌కు స్థానిక కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు ఈ.రాజేశ్వరి, జి.మౌనిక, ఎం.ధనలక్ష్మి, జె.వెర్రి స్వామి కలిసి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలం నీళ్లు నిలిచి రోడ్డు కనిపించక ప్రజలు ఇబ్బంది పడుతున్న ఫొటోలను కలెక్టర్‌కు చూపించగా ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత శిథిలమైన రోడ్డుపై ప్రజలు ఎలా తిరుగుతారని పంచాయత్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎమ్‌డి.యూనుస్, ఎస్.రమణ గౌడ్, ఎ.మంజుల, ఈ.లక్ష్మణ గౌడ్, ఎం.బాలమ్మ, ఎస్.అన్వర్ బాష, కె.నాగేంద్ర, సివి.వర్మ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సర్వే

- పరిశీలించిన డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కర్

సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ భాస్కర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు డాక్టర్స్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అరోరా నగర్‌లో నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ కాంపెయిన్ సర్వేను సోమవారం డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎల్.భాస్కర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... కుష్టు వ్యాధి నిర్మూలనకు ఈ నెల 17 నుంచి 30 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి సర్వే చేస్తున్నామని తెలిపారు. న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, డాక్టర్ లీనా రెడ్డి, డాక్టర్ సునీలమ్మ, డిపిఎంఒ సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్ రెడ్డి బాబు, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను అధికారులు పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ప్రజారోగ్య, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి వివిధ ప్రాంతాల ప్రజలు అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించిన కమిషనర్ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఇన్‌ఛార్జీ ఎస్‌ఇ శేషసాయి, ఎంఇ మనో హర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, ఆర్‌ఒ జునైద్, స్వర్ణలత, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు చంద్రబాబు కృషి

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచీ పాటుపడుతున్నారని, పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులను రాబట్టేందుకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి తెలిపారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, డిసిఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టిడిపి నాయకులు కె.ఉమాపతి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించారని, ఉమ్మడి కర్నూలు జిల్లాకు పరిశ్రమల స్థాపనకు వీలు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు తరలి వెళ్లాయని గుర్తుచేశారు. రాష్ట్రంలోని రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రను సమదృష్టితో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మూడు ప్రాంతాలకు పరిశ్రమలను తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేశారని తెలిపారు. ఇప్పటికే మేఘా, రెన్యూ, చింతా, ఎస్ఎఈఎల్, బొందాడ, ఆస్త్రా, అదాని, జెఎస్‌డబ్ల్యు, టాటా, అయానా, అగస్త్య వంటి కంపెనీలను రాయలసీమకు తీసుకొచ్చి రెన్యూవబుల్ ఎనర్జీ హబ్‌గా నిలిపారన్నారు. గతంలో రాయలసీమలో పెట్టుబడులు పెట్టేందుకు వెనుకంజ వేసిన కంపెనీలు, ఇప్పుడు ప్రభుత్వ స్థిరత్వం, పారదర్శకత చూసి ముందుకు వస్తున్నాయన్నారు. టిడిపి నాయకులు బి.సంజీవలక్ష్మి, కె.నాగేంద్రకుమార్, పి.రవికుమార్, జె.పుల్లయ్య, డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

22న ఆత్మీయ అభినందన సభ

ఈనెల 22న జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న ఆత్మీయ అభినందన సభను జయప్రదం చేయాలని పి.తిక్కారెడ్డి కోరారు. టిడిపి కార్యాలయంలో ఆహ్వాన పత్రికను కెడిసిఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాగమునితో కలిసి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, మౌలికవస్తుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రముఖ సీనియర్ న్యాయవాది జి.నాగముని ఎంపికైన నేపథ్యంలో ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని జమ్మి చెట్టు సమీపంలో లలితా పీఠం వద్ద పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ సిరిని సిపిఎం ఓల్డ్ సిటీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్ల నుంచి 30 నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసముంటున్నాయని తెలిపారు. వీరికి పట్టాలు మంజూరు చేయాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు టిడిపి నాయకులు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పట్టాలిచ్చి వారికి పక్క గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే నగరంలో ఉన్న పేదలను సమీకరించి ఇళ్లస్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సోలోమన్ రాజు, కుమార్ పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టాంప్ డ్యూటీలు చెల్లించండి : సర్పంచులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పంచాయతీలకు స్టాంప్ డ్యూటీని చెల్లించాలని సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ.తాండ్రపాడు సర్పంచి బాలపీరా, దేవమాడ సర్పంచి ఈశ్వరయ్య, దిన్నెదేవరపాడు సర్పంచి మాధవస్వామి, నందనపల్లె సర్పంచి మాధురిలు డిఆర్‌ఒను కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీలకు రెండేళ్ల నుంచి స్టాంప్ డ్యూటీలు రావడం లేదని వారు పేర్కొన్నారు. ఆర్థిక సంఘం నిధులు కూడా పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సరిపోవడం లేదన్నారు. పంచాయతీలకు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి : సిపిఎం

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పత్తికొండ

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఎం పెద్దహుల్తి గ్రామ శాఖ నాయకులు సురేంద్ర, బ్రహ్మయ్య, నరసింహులు, రాముడు కోరారు. సోమవారం పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... గత వైసిపి ప్రభుత్వంలో సర్వేనెంబర్ 130/2లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని, ఇంటి పట్టాలకు ఆనుకొని మిగిలి ఉన్న భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సూపరింటెండెంట్‌కు అభినందనలు తెలుపుతున్న డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నియామకమైన డాక్టర్ ఎన్. నాగేశ్వరావు

ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్ల నియామకం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పరిపాలన విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ ఇద్దరు సీనియర్ అధ్యాపకులను డిప్యూటీ సూపరింటెండెంట్లుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆస్పత్రి అడిషనల్ డిఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. సైకియాట్రీ విభాగం ప్రొఫెసర్ హెచ్ఒడి డాక్టర్ ఎన్.నాగేశ్వరరావు, జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మీబాయిని డిప్యూటీ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీబాయి, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - సి బెళగల్

గత నెలలో కర్నూలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కంబదహాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారని ఇన్‌ఛార్జీ హెచ్ఎం అక్బర్ సోమవారం పేర్కొన్నారు. అండర్-17 విభాగంలో ఎం.డేనియల్, సి.పుష్పవతి, అండర్-14 విభాగంలో ఇందు ఎంపియ్యారని తెలిపారు. అండర్-14 చిత్తూరు జిల్లా మదనపల్లి, అండర్-17 గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు బబ్లు శ్రీనివాసులును అభినందించారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 84 ఫిర్యాదులు వచ్చాయని ఎస్‌పి తెలిపారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని... 'తెలిసిన వ్యక్తులతో కలిసి ఆన్‌లైన్‌లో జెఎమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో రూ. 1 కోటీ 42 లక్షలా 24 వేలు ఇన్వెస్ట్ మెంట్ చేశాము. ఒక లక్షకు నెలకు 1 లక్ష 35 వేలు ఇస్తామని 3 నెలలు లాభాలు చూపించి ఆన్‌లైన్‌లో నమ్మించారు. తర్వాత ఆన్‌లైన్ కాంటాక్ట్‌లో లేకుండా పోయారని' కర్నూలు అశోక్ నగర్‌కు చెందిన యశ్వంత్ ఫిర్యాదు చేశారు. 'భాను ప్రసాద్ అనే వ్యక్తి వైజాగ్‌లోని ఎల్‌టిడబ్ల్యూ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 10 మంది నుండి ఒక్కొక్కరి దగ్గర రూ. 1 లక్ష 50 వేలు తీసుకోని మోసం చేశాడ'ని ఆదోనికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. 'హుస్సేన్, సుబ్బయ్యలు నన్ను కాంట్రాక్ట్ బేసిక్ కింద తక్కువ జీతంతో ఉద్యోగం ఎన్ని రోజులు చేస్తావు అని, ఉద్యోగం పర్మినెంట్ చేపిస్తామని చెప్పి రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేశార'ని కర్నూలు శరీఫ్ నగర్‌కు చెందిన జగన్నాథం ఫిర్యాదు చేశాడు. 'తనకున్న 6 మంది కొడుకులు సరిగ్గా చూసుకోవడం లేదని, తల్లిదండ్రులని చూడకుండా అన్నం పెట్టకుండా కొట్టి, ఇబ్బందులకు గురి చేస్తున్నార'ని సి.బెలగల్ మండలం, కొండాపురానికి చెందిన తిమ్మప్ప ఫిర్యాదు చేశారు. 'బోయ రామక్రిష్ణ అనే వ్యక్తి రూ. 6 లక్షలా 80 వేలకు ప్లాటు అమ్మి అగ్రిమెంట్ చేయించి కనబడకుండా పోయాడ'ని ఎమ్మిగనూరు చెందిన షేక్ యూసుఫ్ ఫిర్యాదు చేశాడు. పొలం రస్తా విషయంపై దాడి చేశారని ఆదోని మండలం, దిబ్బనకల్లు గ్రామానికి చెందిన బుజ్జనల ఈరమ్మ ఫిర్యాదు చేసింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బాధితులకు హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, సిఐలు రామకృష్ణ, ఇబ్రహీం పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ

ఒకేషనల్ ప్రిన్సిపల్ నాగస్వామిని అభినందిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ రంజిత్‌బాషా

ఒకేషనల్ ప్రిన్సిపల్‌కు అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలులోని ప్రభుత్వ బీక్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్‌ను ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ రంజిత్ బాషా సోమవారం అభినందించారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నందుకు ఆయన అభినందించారు. వృత్తి విద్యా అభివృద్ధికి కళాశాలను రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎఫ్ఎసి వి.పెద్దక్క ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిడి సుధీర్, జి.రామమోహన్ రావు, రాయపాటి శ్రీనివాస్ పాల్గొని పోటీలు నిర్వహించారు. అనంతరం 'పుస్తకం నా నేస్తం' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు, చంద్ర శేఖర కల్కూర, ముచ్చుకోట చంద్రశేఖర్, కెజి.గంగాధర రెడ్డి, వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాష, నషీమా బీ, రేణుక, పద్మావతమ్మ, ఈశ్వరమ్మ, ఉమా, నాగ భాస్కర్ పాల్గొన్నారు.

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 20న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.నరసింహులు పేర్కొన్నారు. సోమవారం బంగారుపేటలోని సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ నాయకులు లియాకత్ అలీ ఖాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డును 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ వెల్ఫేర్ బోర్డును 12, 14 మెమోను తీసుకువచ్చి నిలుపుదల చేసిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు సంక్షేమ బోర్డు ప్రారంభంకాకపోవడంతో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించని ఎడల భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో అనేక దఫాలుగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సెంట్రింగ్ యూనియన్ నాయకులు మా బాష, రామకృష్ణ, నరేష్, దస్తగిరి, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు


డిఇఒ కార్యాలయంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నగర అధ్యక్షులు కాశన్న

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి ఎన్‌జిఒ నగర అధ్యక్షులు కాశన్న

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ నగర అధ్యక్షులు ఎంసి.కాశన్న డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని డిఇఒ కార్యాలయంలో ఎపి ఎన్‌జిఒ సభ్యత్వ నమోదు చేపట్టారు. కోడుమూరు తాలూకా అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్ ఈశ్వరయ్య, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేంద్ర బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - పత్తికొండ

పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం-2, బాలికల వసతిగృహం విద్యార్థులకు సోమవారం హాస్టల్ వార్డెన్లు వెంకటరాముడు, పావనిలు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... చలికాలంలో హాస్టల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉన్నతాధికారులు దుప్పట్లు పంపిణీ చేశారన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉంటూ అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నామని తెలిపారు.

కల్లూరులో గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరులో గ్రంథాలయ ఉద్యమకారులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. శాఖ గ్రంథాలయ అధికారి ఈ.సంధ్యారాణి ప్రారంభించారు.

బీడి కార్మికుల నివాసం వద్ద రోడ్లు వేయాలి

- బీడి కార్మికుల యూనియన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వెంకయ్య పల్లి ఇందిరమ్మ కాలనీలో బీడి కార్మికుల ఇళ్లు ఉన్నచోట రోడ్లు వేయాలని బీడి కార్మికుల యూనియన్ నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్.అబ్దుల్ దేశాయ్, నాయకులు చాంద్ బాషా కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2004 కాంగ్రెస్ హయాంలో కర్నూలు నియోజకవర్గంలో గఫూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ సహాయంతో బీడి కార్మికులకు ఇళ్లు నిర్మించాలని.. 2004 నుంచి 2009 వరకు ఇందిరమ్మ కాలనీ దగ్గర బీడి కార్మికులకు 817 ఇళ్లు మంజూరు చేయించారని తెలిపారు. 2009 నుంచి 2025 వరకు అక్కడ బీడి కార్మికులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారని చెప్పారు. దాదాపు 15 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారి ఇళ్ల ముందు రోడ్డు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే వెంకయ్యపల్లి ఇందిరమ్మ కాలనీ దగ్గర బీడి కార్మికులకు రోడ్లు, డ్రెయినేజీలు, లైట్లు, మౌలిక వసతులు కల్పిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మరిచారని విమర్శించారు. సచివాలయం, మున్సిపాలిటీ కార్యాయంలో ముందు చాలాసార్లు ధర్నాలు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించారని, రోడ్ల నిర్మాణం చేపట్టలేదని చెప్పారు. ముళ్లకంప పెరిగిపోయిందని, అక్కడున్న సచివాలయ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మహిళలు, పిల్లలు, పెద్దలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారని, రోడ్లు వేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. లేకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సాధిక్, మహబూబ్ బాషా, ఇబ్రహీం, ఆబిద్, సలీం, నౌషాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'అంగన్వాడీలను బలోపేతం చేయాలి'

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయడం ఆపాలని, అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.గోపాల్, నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప కోరారు. సోమవారం గోకులపాడు, పర్ల సచివాలయాల్లో అడ్మిన్లకు అంగన్వాడీ టీచర్లతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారని కారణం చూపి ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని చూస్తోందని, ఇది దుర్మార్గమని విమర్శించారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు అంగన్వాడీల్లో ఉండాలని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. చాలామంది ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారని, దీనివల్ల అంగన్వాడీల్లో పిల్లల సంఖ్య తగ్గుతోందని చెప్పారు. ఆరేళ్ల నుంచి మాత్రమే పాఠశాలల్లో చేర్చుకోవాలని జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలను పెంచాలని, పరిమాణాన్ని పెంచాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించరాదని తెలిపారు. అంగన్వాడీలు సమత, నాగేంద్రమ్మ, అరుణ జ్యోతి, నాగ లత, సాలమ్మ, మద్దమ్మ, రాములమ్మ, మాధవ రాజేశ్వరి, మహాలక్ష్మి, నాగజ్యోతి, అనసూయమ్మ, సురేఖ, రాములమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పది, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థుల మానసిక ఒత్తిడి నివారణకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శీను డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ సిరిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... ఇటీవల కాలంలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు పెరిగిపోతున్నాయని, ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. కెరియర్ కౌన్సెలింగ్, శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఉస్మానియాలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని ఉస్మానియా డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సమీవుద్దీన్ ముజామిల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ కోర్సుల్లో చేరే అభ్యర్థులు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 22 నుంచి 24 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, అనంతరం ఫీజు చెల్లింపు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు.